క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

తిరుమలగిరి : తాటిపాముల గ్రామం నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు బందెల రవి కోరారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాటిపాముల బిక్కేరు వాగు నుంచి అక్రమార్కులు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అనుమతుల పేరిట అక్రమంగా ప్రైవేట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ సూర్యాపేట మండల అధ్యక్షుడిగా మల్లేష్



నియామకపత్రం అందుకుంటున్న మల్లేష్

భానుపురి : ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన పాముల మల్లేష్‌ను నియమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పాలడుగు పరశురాములు తెలిపారు. శుక్రవారం స్థానిక పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్లేష్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 29న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ఎమ్మార్పీఎస్ టీఎస్ పోరు గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బ రమేష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు దైద ఉపేందర్ మాదిగ, పాముల జనార్దన్, సూరారపు దేవేందర్, టి.కార్తీక్, బి.మధు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సహకార సంఘం కమిటీ ఎన్నిక



యాదగిరిగౌడ్

అర్వపల్లి : కాసర్లపహాడ్, వేల్పుచర్ల గ్రామాలకు సంబంధించిన కల్లుగీత సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం కాసర్లపహాడ్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఖమ్మంపాటి సాంబయ్య గౌడ్, కార్యదర్శిగా కె.కర్ణయ్యగౌడ్, డైరెక్టర్లుగా పిట్టల వెంకన్నగౌడ్, కె. పెదవెంకన్న, కె. చిన అంజయ్య, కె. శ్రీనివాస్, డెంకెల శంకర్, కె. అంజయ్య ఎన్నికయ్యారు.

గుంతల పూడ్చివేత



మట్టితో గుంతలు పూడ్చుతున్న యువకులు

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామ బీటీరోడ్డుపై ఎస్సారెస్పీ వంతెన మీద బీటీ లేచిపోయి గుంతలేర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఆరో వార్డు సభ్యురాలు కుంభం శౌరీ ఖలింగయ్య స్పందించి తన సొంత ఖర్చులతో శుక్రవారం గుంతల్లో మట్టిపోసి పూడ్పించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల నరసింహ, కుంభం యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

మునగాల : మునగాల మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డిపై కొందరు సర్పంచ్‌లు చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని మండలానికి చెందిన 19 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఈమేరకు శుక్రవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మునగాలలో వారు విలేకరులతో మాట్లాడారు. బిల్లుల విషయంలో ఎంపీఓ కమీషన్ డిమాండ్ చేస్తున్నారన్నది అవాస్తమని తెలిపారు. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు రావాల్సినవి ఏమీ లేవన్నారు. గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం చేసిన తీర్మానాలే ఆమోదించడం జరుగుతుందని, దీనిలో ఎంపీఓ హస్తం ఉండదన్నారు. సర్పంచ్‌లు ఎంపీఓపై కక్షసాధింపు చర్యతో వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్ విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

బస్సుల్లో ప్రయాణికుల రద్దీ

అర్వపల్లి : సంక్రాంతి పండుగ, విద్యాసంస్థలకు సెలవుల కారణంగా ప్రయాణికులు, విద్యార్థులతో బస్సులు కిటకిట లాడుతున్నాయి. సూర్యాపేట–జనగామ రూట్లలో తిరిగే బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. పండుగ దృష్ట్యా బస్సులను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



అర్వపల్లిలో బస్సు ఎక్కడానికి పరుగెత్తుతున్న ప్రయాణికులు

వైభవంగా కూడారై ఉత్సవాలు



సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం దేవాలయంలో..

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై పాయస నివేదన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ధనుర్మాస విశిష్టతను, కూడారై పాయస వైభవాన్ని భక్తులకు తెలియపరిచారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కూడారై పాయసాన్ని భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నూగురు వెంకట రంగాచారి, శ్రీనివాస చారి, రమాకాంత్, శ్రీకాంత్, గ్రామస్తులు చిలుముల రాంరెడ్డి, లింగారెడ్డి, చందా కృష్ణమూర్తి, కొణతం జయమ్మ, పందిరి కవిత, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెంలోని ఆలయంలో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 గంగాళాలతో పాయస నివేదన పూజను జరిపారు. 108 తామర పుష్పాలతో విశేషార్చన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. మహిళలు గోదాదేవికి మంగళహారతులిచ్చి కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాసరెడ్డి, అర్చకులు అర్వపల్లి విఖనసచార్యులు, రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, చక్రవర్తి, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.



ఫణిగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస వేడుకల్లో భాగంగా 27వ రోజున గోదాదేవిని ప్రత్యేక వస్త్రాలు, గాజులతో అలంకరించి, 108 గంగాళంలలో ప్రసాదాన్ని నివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాలూరి రామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలోని రామాలయంలో..

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవి కూడారై మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంలో 108 గంగాళంలలో పాయసాన్ని స్వామివారికి నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సంతోష్‌కుమార్ ఆచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రియాంక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి గుయ్యని ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ యూసుఫ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుణగంటి నరసింహారావు, జిల్లా కార్యదర్శి నారాయణ సతీష్ కుమార్, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు నేతికండ్ల విజయ్, ధర్మ రాజు, ప్రసాద్, మోహన్‌రెడ్డి, సైదులు, వంపు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న హిందువులకు పెద్ద పండుగ



అయోధ్యకు బియ్యం పంపుతున్న నాయకులు

భానుపురి : ప్రపంచ దేశాల్లో భారతదేశ హిందూ సంప్రదాయం ఎంతో గొప్పదని, ఈనెల 22న హిందువులకు పెద్ద పండుగ అని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య అన్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అమర్నాథ్ అన్నదాన సేవా సమితికి 200 క్వింటాల బియ్యాన్ని శుక్రవారం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద అందజేశారు. బియ్యం లారీని అయోధ్యకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించడం ప్రతి హిందువు గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్, కక్కిరేణి చంద్రశేఖర్, పర్వతం శ్రీధర్, మీలా వాసుదేవ్, సింగిరికొండ రవీందర్, ఈగ వెంకటేశ్వర్లు, నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, సవరాల సత్యనారాయణ, పెద్దిరెడ్డి గణేష్, మీలా వంశీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్సే



సూర్యాపేటలో కేక్ కట్‌చేస్తున్న వేణారెడ్డి

భానుపురి: పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చంచల శ్రీనివాస్, రాంబాబు, వాసు, మాణిక్యం, రాంబాబు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



అర్వపల్లి : తిమ్మాపురంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పాలెల్లి సురేష్, వెంకట్‌రెడ్డి

అర్వపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తిమ్మాపురం సర్పంచ్ పాలెల్లి సురేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం గల్లీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రత్నం లక్ష్మాజీ, సీపీఎం మండల మాజీ కార్యదర్శి ఎల్లంల అవిలయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, బింగి బాలరాజు, అరుణ్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు బొల్లం ఉమేష్, ఎల్లంల ఉమేష్, కృపాకర్, సతీష్, రమేష్, మహేష్, నరేష్, జాని, వినీష్, కోటేష్, సంపత్, సాయి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

తుంగతుర్తి : యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో సంకినేని రామారావు, కమలమ్మల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25,116, ద్వితీయ బహుమతి రూ.18,116, తృతీయ బహుమతి రూ.10,116 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేపాక సాయిబాబా, కత్తుల నరేష్, ప్రశాంత్, లక్ష్మణ్, నాగరాజు, సాయిక్రిష్ణ, రవి, నవీన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పోలుమల్ల గ్రామంలో..

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో శేరి శ్రీనివాస్‌రెడ్డి, తన్నీరు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, నాగయ్య, ఉపేందర్, రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు



మద్దిరాల : పోలుమల్లలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

స్వామి వివేకానందుడికి ఘన నివాళి



సూర్యాపేట : స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, తదితరులు



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సూర్యాపేట : నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వామి వివేకానంద సమితి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత ఎన్ని కష్టాలు ఎదురైనా విజయం సాధించడంలో వెనకడుగు వేయవద్దని అన్నారు. వివేకానంద చిన్న వయస్సులోనే విదేశాలకు వెళ్లి భారతదేశంలో ధర్మం యొక్క గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి వెంకటరెడ్డి, కౌన్సిలర్ తాహేర్‌పాషా, నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్, సుంకర రమేష్, చల్లమళ్ల నర్సింహ, పెండెం చంద్రశేఖర్, పాండురంగాచారి, కర్నాటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రపంచానికి భారతదేశ ఆధ్యాత్మిక విలువలను చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, ముత్యాల కిషన్, చైతన్య, రేవతి, మధు, చందు పాల్గొన్నారు.

తిరుమలగిరి : స్వామి వివేకానంద జయంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మండడి పద్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి గాదెరబోయిన సురేష్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, నరోత్తమ్‌రెడ్డి, నర్సయ్య, ఐతె శ్రీనివాస్, గణేష్, సుదర్శన్‌రావు, సుందర్, జయపాల్‌రెడ్డి, సోమేష్, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : స్వామి వివేకానందుడి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన వివేకానందుడి జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇమ్మారెడ్డి రాజబహదూర్‌రెడ్డి, గొడిశాల లింగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



సూర్యాపేట పట్టణంలోని జయ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాల ముగ్గులు వేసి రంగులు అద్దారు. అలాగే గాలిపటాలు ఎగురవేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజు, డైరెక్టర్ డాక్టర్ డి.కిరణ్‌కుమార్, డి.నాగరాజు, నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బోనగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జయ పాఠశాలలో..

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో దాదాపు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జిల్లా పద్మ, బింగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర



అనంతారంలో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు, ప్రజాప్రతినిధులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారంలో అయోధ్య రాముడి అక్షింతల కలషానికి శుక్రవారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. అక్షింతలతో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం నుంచి పుర వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు, బైరెడ్డి లక్ష్మమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, జయమ్మ, ధర్మారెడ్డి, మామిడి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీల ఎన్నిక

అనంతగిరి : ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనంతగిరి మండల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ అనంతగిరి మండల అధ్యక్షుడిగా కొండపల్లి సూరి, ఎంఎస్పీ అధ్యక్షుడిగా మీసాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఎంఎస్పీ జిల్లా కార్యదర్శిగా బొడ్డు కుటుంబరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా కుక్కల కృష్ణమాదిగ, ఎంఎస్పీ జిల్లా సహాయ కార్యదర్శిగా కొండపల్లి జానును ఎంపిక చేసినట్లు తెలిపారు.

వసతులకు నోచుకోని బస్టాండ్



తుంగతుర్తిలోని బస్టాండ్

- తుంగతుర్తి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



నిరుపయోగంగా మారిన చేతిపంపు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తిలో సుమారు 15 ఏళ్లక్రితం బస్టాండ్‌ను నిర్మించారు. అప్పట్లో బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. కొంత కాలం పాటు బస్టాండ్‌లో వసతులు మెరుగ్గానే కన్పించాయి. కానీ గత నాలుగైదేళ్లుగా బస్టాండ్‌లో నీటి సౌకర్యం లేకపోవడంతో టాయిలెట్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారి నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. అలాగే బస్టాండ్‌లో ఊడ్చే వారుకూడా కరువైనారు. బస్టాండ్ ఆవరణలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ మధ్య కాలంలో బస్టాండ్‌లో సీసీరోడ్డు పోసినా అది కూడా పూర్తిస్థాయిలో లేదు. ఈ బస్టాండ్ నుంచి సూర్యాపేట, హైదరాబాద్, హన్మకొండ, వరంగల్, యాదగిరిగుట్ట, జగద్గిరిగుట్ట, ఖమ్మం పట్టణాలకు బస్సులు వెళ్తుంటాయి. కానీ బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ఎవరూ బస్టాండ్‌లోకి రావడంలేదు. అందరూ మెయిన్‌రోడ్డుపైనే బస్సులు ఎక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



తుంగతుర్తి బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో టాయిలెట్స్, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం లేవు. మౌలిక వసతులు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌కు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి.

– జక్కి కాశీ, తుంగతుర్తి

ఇసుక టిప్పర్లు పట్టివేత

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఏపీలోని జగ్గయ్య పేట నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కోదాడ వైపు వస్తుండగా రామాపురం క్రాస్‌రోడ్‌లో పట్టుకొని డ్రైవర్, ఓనర్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదే విధంగా మంగళితండా నుంచి అక్రమంగా వస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను కూడా పట్టుకొని కేసు చేసినట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండి. రఫీ (53) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ లంకెల అలివేలు మంగమ్మ, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, పాండురంగారావు, రఫీ, కుక్కడపు సైదులు, పులి రాజారావు, గామయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో తప్పిదాలకు సిబ్బందే బాధ్యులు

అర్వపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో తప్పిదాలు జరిగితే సిబ్బందే బాధ్యులని డీఆర్‌డీఓ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడారు. గ్రామాల్లో వలసల నివారణకు కూలీలందరికీ పనులు కల్పించాలని సూచించారు. సామాజిక తనిఖీల్లో మండల వ్యాప్తంగా 450 మొక్కలు చనిపోయినట్లుగా గుర్తించారని.. వీటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో రూ.3,24,46,718లతో 366 ఉపాధి పనులు చేపట్టగా ఈ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్‌ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సందీప్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, జిల్లా విజిలెన్స్ అధికారి అన్సారి, సోషల్ ఆడిట్ అధికారిణి ఆశారాణి, ఎస్ఆర్‌పీ కల్యాణి, ఏపీఓలు చిలుక ఉపేందర్, యు. శైలజ, ఈసీ నగేష్, టీఏలు దీపిక, యాదమ్మ, నాగమణి, సీఓలు సుధీర్‌రెడ్డి, రాజన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్